# నేల మీద సాగు

"నాన్నా నన్ను వేరే ఉద్యోగం చూసుకోమన్నారు. నెల రోజుల గడువిచ్చారు. ఈలోగా ఇంకో ఉద్యోగం రాకపోతే, నేను మన ఊరు వస్తాను" ముంబయి నుండి తన తండ్రికి ఫోన్ చేశాడు అక్షయ్.

"ఇది అమెరికా వాళ్ళ పుణ్యమనుకుంటాను. అక్కడి కంపెనీల్లో జరిగిన అవకతవక వల్ల చాలామంది ఉద్యోగాలు కోల్పోయారని వార్తల్లో విన్నాను. పత్రికల్లో చదివాను. అయితే ఆ సెగ నాకూ అంటిందన్న మాట. పరవాలేదు. మనకేం ఆర్థిక మాంద్యం లేదు. జలయజ్ఞంతో మన పొలాలకు మూడు కాలాలూనీరే. దిగుబడి కూడా బావుంది. నీవేం చింతపడవద్దు. వెంటనే మన ఊరికి వచ్చెయ్. ఇక్కడ కొన్ని రోజులు సేద తీరింతర్వాత ఇంకో ఉద్యోగం చూసుకోవచ్చు. ఉద్యోగం దొరక్కపోయినా మనకొచ్చిన నష్టం లేదు. నీలాంటి చదువుకున్న వాళ్లు, ఇక్కడ ఏదో స్వయం ఉపాధి చూసుకోవచ్చు. మన వ్యవసాయం ఉండనే ఉంది. నీరాకకై ఎదురుచూస్తుంటాం" ధర్మారావు కొడుక్కి భరోసా ఇచ్చాడు.

అక్షయ్ ఇంజనీరింగ్ పాసైంతర్వాత ఎం.బి.ఏ. కూడా చేశాడు. ముంబయిలో మంచి సంస్థల్లో ఉద్యోగం వచ్చింది. అంతే! అక్షయ్ ఆముదాలవలస నుండి

ముంబయిలో దిగాడు. రెండేళ్ళ నుండి ముంబయిలో ఉంటున్న అతనికి అక్కడి నీళ్ళు బాగానే వొంటబట్టాయి.

అతను పనిచేస్తున్న కంపెనీ ముఖ్యాలయం అమెరికాలో ఉండడం, అక్కడ ఆ సంస్థ దివాలా తీయడంతో అక్షయ్ ఉద్యోగానికి ఎసరొచ్చింది. తండ్రి ఎంత తమ ఊరికి రమ్మన్నా అతనికి మాత్రం ముంబయిలోనే మరో ఉద్యోగం చూసుకోవాలని ఉంది. కాని ఈ గడ్డు పరిస్థితుల్లో ఇంకో ఉద్యోగం, అదీ 'ఆ' కంపెనీ మాజీ ఉద్యోగిగా దొరకడం కష్టమే. అథవా దొరికినా జీతం సగానికి పైగా తగ్గిపోవచ్చు. అంతనష్టం సహించడానికి అతను మానసికంగా సిద్ధంగాలేడు.

మిత్రులతో చర్చించి తమ ఊరు ప్రయాణానికే ఓటు చేశాడు అక్షయ్. తమ ఊళ్ళో, జిల్లాలో, ఆర్థిక మాంద్యం లక్షణాలేవీ అతనికి కనబడలేదు. కూలిపని వారు, రైతులు తమ పనులు తాము చేసుకుంటున్నారు. వారిలో ఏ మాత్రం చింత, ఆందోళన లేదు.

అమెరికా అర్థిక వ్యవస్థపై ఆధారపడ్డ వాళ్ళు మాత్రం కోలుకోలేని దెబ్బతిన్నారు. షేర్ మార్కెట్టులో ఆడిన వారు చతికిల బడ్డారు. తనలాంటి ఉద్యోగస్తులు రోడ్డున బడ్డారు. అమెరికాకు ఎగుమతి చేసేవారు డీలా పడ్డారు. సాఫ్ట్‌వేర్‌ను నమ్ముకుని కత్తిమీద సాము చేయడం కంటే నేల మీద సాగుచేస్తూ నేల తల్లితోనే సాగుతూ ఉండాలని అక్షయ్ నిర్ణయించుకున్నాడు. నడమంత్రపు సిరితో ఆకాశంలో విహరించిన వారు నేలమీదికి విసిరివేయబడ్డారు. విలాసాలకు అలవాటుపడ్డవారు కనీసావసరాలకు పరిమితమయ్యారు. మన గ్రామీణ ఆర్థిక వ్యవస్థ మాత్రం పటిష్టంగా ఉంది. అందుకే అక్షయ తమ ఊర్లోనే ఏదో ఉపాధి చూసుకోవాలని అనుకున్నాడు.